


రోడ్డుపై కాలిబూడిదైన కారు

రోడ్డుపై వెళ్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి కాలిపోయింది. ఈ ఘటన ముడిమ్యాల గేట్ వద్ద జరిగింది. 10లో▸



గురువులు సమాజ నిర్మాతలు

గురువులు నవ సమాజ నిర్మాతలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి అన్నారు. 10లో▸



న్యూస్‌రీల్

మైసిగండి మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు



కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. మొత్తం 60 రోజులకుగాను రూ.12,01,567 ఆదాయం వచ్చింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంక్‌లో డిపాజిట్ చేయనున్నట్లు ఈవో స్నేహలత తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీ, సిబ్బంది, అన్నపూర్ణ సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మాసబ్ చెరువును పరిరక్షిస్తాం



మాసబ్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

తుర్కయంజాల్: మాసబ్ చెరువును పరిరక్షిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు శిఖం సర్వే నంబర్ 137లోని భూమిలో రోడ్డు నిర్మాణానికి డంప్ చేసిన మట్టిని తొలగిస్తున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మట్టి డంప్ చేసిన వారిపై కేసులు నమోదు చేశారా లేదా అని ఆరా తీశారు. మట్టి తొలగింపు పనులను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.

మున్సిపాలిటీలో కలపండి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాగిరెడ్డిగూడ గ్రామస్తులు

మొయినాబాద్: మండలంలోని నాగిరెడ్డిగూడ పంచాయతీని కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని నాగిరెడ్డిగూడ గ్రామస్తులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. ఈ మేరకు గురువారం వేర్వేరుగా వారిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. నాగిరెడ్డిగూడ గ్రామం గతంలో రాజేంద్రనగర్ సమితిలో ఉండేదని.. 1982 వరకు హుడా పరిధిలోనే ఉన్న తమ గ్రామ రెవెన్యూలోని భూముల రిజిస్ట్రేషన్ ధరణి రాకముందు హైదరాబాద్‌లో జరిగేవని వివరించారు. భౌగోళికంగా మొయినాబాద్ మున్సిపాలిటీ మధ్యలో నాగిరెడ్డిగూడ గ్రామ రెవెన్యూ భూములు ఉన్నాయన్నారు. హిమాయత్‌సాగర్ జలాశయానికి ఆనుకుని ఉన్న తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపితేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ సద్గుణాచారి, మాజీ ఎంపీటీసీ అర్జున్, నాయకులు మాణిక్యం, సుధాకర్, వినోద్‌కుమార్, మహేందర్, యాదగిరి, మల్లేష్, అశోక్, రవీందర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, ముత్యాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

మహేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ లక్ష్మీసుధ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు 91542 98784 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించాలని, సమస్యలను తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన అంతంతే..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారు 1,07,865 మంది కాగా.. వీరిలో ఇప్పటి వరకు కేవలం 5,505 మంది మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీని వినియోగించుకున్నారు. తద్వారా జీహెచ్‌ఎంసీకి రూ.69.62 కోట్లు సమకూరాయి. మొత్తం దరఖాస్తుదారుల్లో 58,523 మందికి ఆటోమేటిక్‌గా ఫీజు లెటర్స్ జారీ కాగా, వారిలో కేవలం 5,505 మంది మాత్రమే 25 శాతం ఫీజు రాయితీని వినియోగించుకున్నారు. వీరిలో 40 మందికి ప్రొసీడింగ్స్ జారీ అయినట్లు సమాచారం. మరో నాలుగు రోజుల్లో గడువు ముగుస్తుందని, మిగతా వారు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ సూచించింది.

యూజీ పవర్

ఓహెచ్ లైన్ల బదులు అండర్‌గ్రౌండ్ కేబుళ్లు



- ఆసక్తిగల ఏజెన్సీల నుంచి డీపీఆర్‌ల ఆహ్వానం
- గ్రేటర్‌లో 900 కిలోమీటర్ల ఓవర్‌హెడ్ లైన్లు
- అండర్ గ్రౌండ్ కేబుల్స్‌కు రూ.520 కోట్లు అవసరం
- డిస్కంకు నేడు డీపీఆర్‌లు సమర్పించనున్న ఏజెన్సీలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇళ్లపై వేలాడుతూ ప్రమాదకరంగా మారిన ఓవర్‌హెడ్ (ఓహెచ్) లైన్ల స్థానంలో అండర్ గ్రౌండ్ (యూజీ) కేబుల్స్ వేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తయారు చేసి సమర్పించాల్సిందిగా కోరుతూ డిస్కం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఆరు ప్రముఖ అధ్యయన సంస్థలు దీనికి ముందుకు వచ్చినట్లు తెలిసింది. 900 కిలోమీటర్ల ఓహెచ్ లైన్ల స్థానంలో యూజీ కేబుళ్లను వేసేందుకు రూ.520 కోట్ల వరకు ఖర్చు కానున్నట్లు అంచనా. ఆయా ఏజెన్సీలు రూపొందించిన నివేదికను శుక్రవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు సమర్పించనున్నాయి.

ఓవర్‌హెడ్ లైన్ రహిత నగరంగా..

- గ్రేటర్‌లో ప్రస్తుతం 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 52 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ప్రతిరోజూ గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 60 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. వచ్చే వేసవిలో విద్యుత్ డిమాండ్ 100 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం లేకపోలేదు. పాతబస్తీ సహా ప్రధాన బస్తీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్‌హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి.
- చిన్నపాటి ఈదురుగాలితో కూడిన వర్షానికే తెగి పడుతున్నాయి. విద్యుత్ అంతరాయాలతో పాటు అనేక మంది మృత్యువాతకు కారణమవుతున్నాయి. లైన్ల కింద అనేక చోట్ల భారీ భవంతులు వెలిశాయి. ఇంటిపై దుస్తులను ఆరవేసేందుకు వెళ్లిన మహిళలు, పతంగ్‌లను ఎగరేసేందుకు వెళ్లిన పిల్లలు ఓవర్‌హెడ్ లైన్‌కు ఆనుకుని విద్యుత్ షాక్‌తో మృతి చెందుతున్న ఘటనలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ఓవర్‌హెడ్ లైన్ల స్థానంలో యూజీ కేబుళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చవచ్చని డిస్కం భావిస్తోంది. హైదరాబాద్‌ను ఓవర్‌హెడ్ లైన్ రహిత నగరంగా అంతర్జాతీయ పటంలో చూపించవచ్చని యోచిస్తోంది.

జీహెచ్‌ఎంసీ పరిధిలో విద్యుత్ నెట్‌వర్క్ ఇలా..

33/11కేవీ సబ్‌స్టేషన్లు	498
33కేవీ యూజీ కేబుల్	1,280 కి.మీ
33కేవీ ఓవర్‌హెడ్ లైన్స్	3,725 కి.మీ
11 కేవీ ఓవర్‌హెడ్ లైన్స్	21,643 కి.మీ
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	1,022
11కేవీ యూజీ కేబుల్	957
డిటీఆర్‌లు	1,50,992
ఇంటర్మీడియట్ స్తంభాలు	58,271

ప్రాధాన్య క్రమంలో పనులు

- హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్రమాదకరంగా మారిన బహిరంగ విద్యుత్‌లైన్ల (ఓవర్‌హెడ్)ను తొలగించి, వాటిస్థానంలో అండర్ గ్రౌండ్ (యూజీ) కేబుళ్లను వేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఇప్పటికే సుమారు 900 కిలోమీటర్ల ఓవర్ హెడ్ (ఓహెచ్) లైన్లు ఉన్నట్లు గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ కేబుళ్ల ఏర్పాటుకు రూ.520 కోట్లకు పైగా ఖర్చు కానుందని అంచనా వేసింది. డీపీఆర్ సమర్పించిన ఏజెన్సీలకే పనులను అప్పగించాలని యోచిస్తోంది.
- గ్రేటర్ మొత్తంగా ఒకే సమయంలో కాకుండా ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టనున్నట్లు రెండు రోజుల క్రితం అసెంబ్లీలో విద్యుత్ శాఖ మంత్రి ప్రకటించడం తెలిసిందే. పేదలు ఎక్కువగా నివసించే నందినగర్, వారాసిగూడ, రాంనగర్, చిలకలగూడ, ఎన్టీఆర్ నగర్, ఇందిరా పార్కు, అశోక్‌నగర్, పద్మారావునగర్, గాంధీనగర్, ఖైరతాబాద్, నాంపల్లి, రాజేంద్రనగర్, బోరబండ, శ్రీరామ్‌నగర్, లెనిన్‌నగర్, మన్సూరాబాద్, నాగోలు, అడ్డగుట్ట, మెహిదీపట్నం, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన లైన్లను మార్చే అవకాశం ఉంది.

డెయిరీ పేరుతో బురిడీ

- పెట్టుబడులు ఆకర్షించి.. బిచాణా ఎత్తేసి
- రూ.15 కోట్ల వరకు టోకరా
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- ఆలస్యంగా వెలుగులోకి..



మొయినాబాద్: డెయిరీ ఫాంలో పెట్టుబడులు పెడితే ప్రతీ నెల కచ్చితమైన లాభాలు ఉంటాయని ప్రకటన ఇచ్చాడు.. పెట్టుబడులు ఆకర్షించి రూ.15 కోట్లు రాబట్టాడు.. ఆ తర్వాత బిచాణా ఎత్తేశాడు.. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలివీ.. నగరానికి చెందిన వ్యాపారులు శ్రీనివాస్‌రావు, కోటేశ్వరరావు 2019లో అజీజ్‌నగర్ రెవెన్యూలో 15 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నారు. అందులో కూరగాయలు, పూల తోటలతోపాటు డెయిరీ ఏర్పాటు చేస్తామని లీజు పత్రాల్లో రాసుకున్నారు. వారు లీజుకు తీసుకున్న భూమిలో కోటేశ్వరరావు బంధువైన వేముల సుబ్బారావు 2021లో కొండపల్లి డెయిరీ ఫాం పేరుతో డెయిరీ ఏర్పాటు చేశాడు. సుమారు 400 గేదెలతో డెయిరీని నడుపుతూ పాల ఉత్పత్తులు చేసేవారు. రెండేళ్ల క్రితం సుబ్బారావు డెయిరీలో పెట్టుబడులు పెడితే ప్రతి నెల కచ్చితమైన లాభాలు ఉంటాయని పేపర్‌లో ప్రకటన ఇచ్చాడు. ఇది చూసిన కొంత మంది పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారు. రూ.15 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటి నుంచి కొనసాగిన డెయిరీని పది రోజుల క్రితం సుబ్బారావు మూసివేశాడు. అందులోని గేదెలను రాత్రికి రాత్రే తరలించాడు. దీంతో రూ.3 కోట్లు పెట్టుబడి పెట్టిన సాయి హరీష్ అనే వ్యక్తి ఈ నెల 17న మొయినాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. అనంతరం మరో ఎనిమిది మంది బాధితులు వేముల సుబ్బారావు, అతని భార్య కుమారి పెట్టుబడులు పెట్టించుకుని తమను మోసం చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పెద్ద మొత్తంలో ఆర్థిక నేరం జరిగిందని కేసును సైబరాబాద్ కమిషనరేట్‌లోని ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

నేడు బాధితుల సమావేశం

అజీజ్‌నగర్‌లో డెయిరీ ఫాంలో పెట్టుబడులు పెట్టించుకుని మోసం చేసిన వేముల సుబ్బారావు మోసాలను ఆధారాలతో బయట పెట్టేందుకు బాధితులు సిద్ధమయ్యారు. శుక్రవారం నగరంలోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. సమావేశానికి మీడియా ప్రతినిధులను ఆహ్వానిస్తూ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

29, 30 తేదీల్లో వాలీబాల్ పోటీలు



చేవెళ్ల: మున్సిపల్ పరిధిలోని దామరగిద్దలో ఈ నెల 29,30 తేదీల్లో 6వ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పవన్, ప్రకాశ్, ప్రసాద్, నరేందర్, నవీన్ తెలిపారు. చేవెళ్లలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించనున్నట్లు చెప్పారు. రూరల్ విభాగంలో ఆయా గ్రామాలకు చెందిన క్రీడాకారులే పోటీలో పాల్గొనాలని తెలిపారు. మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు ఉంటుందన్నారు. ఓపెన్ టూ ఆల్ విభాగంలో మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు ఉంటుందన్నారు. వివరాలకు 76809 88771, 90321 13340, 95501 64093, 80740 63420 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

పేదల ఇళ్ల కోసం మరో పోరాటం

- రామోజీ ఫిలిం సిటీ ఆక్రమణలో ఉన్న 370 ఎకరాలను విడిపిస్తాం
- సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

ఇబ్రహీంపట్నం: రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం ఆక్రమణలో ఉన్న పేదల ఇళ్ల స్థలాలు, 370 ఎకరాల ప్రభుత్వ భూమిని విడిపించుకునేందుకు మరో పోరాటానికి సిద్ధమవుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు సామేల్ అన్నారు. ఇబ్రహీంపట్నం పాషనరహరి స్మారక కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాగన్‌పల్లి రెవెన్యూ పరిధిలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లోకి బుధవారం లబ్ధిదారులు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం, అరెస్టులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. మహిళలని కూడా చూడకుండా విచక్షణారహితంగా ప్రవర్తించారని మండిపడ్డారు. ఫిలింసిటీ యాజమాన్యంతో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం కుమ్మక్కై లబ్ధిదారులైన పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. 18 ఏళ్లుగా తమకు న్యాయం చేయాలని కోరుతున్నా ఇంటి స్థలాల లబ్ధిదారులపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మా కోసం సేకరించిన భూములను తాము అధికారంలోకి వస్తే తిరిగి రైతులకు ఇచ్చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేసిందని వారు విమర్శించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో మరో 2,500 ఎకరాల భూసేకరణకు రంగం సిద్ధం చేయడం ఏమిటని నిలదీశారు. సమావేశంలో ఆ పార్టీ నేతలు బుగ్గరాములు, జంగయ్య, జగన్, నర్సింహ, యాదయ్య, బాలరాజ్, శ్రీను, చరణ్, యాదగిరి, ఎల్లేష్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయం

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి



ఠాణా ఆవరణలో సిబ్బందితో మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

షాబాద్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలతో మమేకం కావాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి పేర్కొన్నారు. షాబాద్ ఠాణాను గురువారం రాత్రి రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫైళ్లను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం సీపీ అవినాశ్ మహంతి మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి విక్రయాలపై గట్టి నిఘా పెట్టాలని తెలిపారు. అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై కన్నేసి ఉంచాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్ కేసులు ఉండొద్దన్నారు. పోలీస్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను చూసి అభినందించారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఫంక్షన్ వర్టికల్‌పై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్‌ఐ రమేష్, సిబ్బంది ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణాపై ఏపీఎం, సీసీలకు కలెక్టరేట్‌లో గురువారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఓ శ్రీలత మాట్లాడుతూ.. పేదరికంలో ఉన్నవారు.. వలస వచ్చిన కుటుంబాలు.. ఉద్యోగం కోసం అన్వేషిస్తున్న యువత త్వరగా అక్రమార్కుల వలలో పడుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలను గానీ, పేదవారిని గానీ నమ్మించి వారి ప్రమేయం లేకుండా నగరాలకు తరలించి వారిని అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 1930.., 100.., 104.., 1098.., 181 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యారావు, డీపీఎంఎస్ సీహెచ్ స్వర్ణలత, యాదయ్య, విలాస్‌రావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.కవిత, ఎంపీఎంలు రవీందర్, యాదగిరి, విజయమాలిని తదితరులు పాల్గొన్నారు.

మరో 13 ఎక్సైజ్ ఠాణాలు

వచ్చే నెల 1 నుంచి కార్యకలాపాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కొత్తగా మరో 13 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు కానున్నాయి. వచ్చే నెల నుంచి ఇవి కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. వాస్తవానికి ఐదేళ్ల క్రితమే కొత్త స్టేషన్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినప్పటికీ అమలుకు నోచుకోలేదు. తాజాగా ఈ ప్రతిపాదనలను పరిశీలించిన ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆమోదముద్ర వేశారు. హైదరాబాద్ ఎక్సైజ్ డివిజన్‌లో కొత్తగా బంజారాహిల్స్ అబ్కారీ స్టేషన్ ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్ దీని పరిధిలోకి రానున్నాయి. సికింద్రాబాద్ డివిజన్‌లో మారేడుపల్లి, చిక్కడపల్లి ఎక్సైజ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. మారేడుపల్లి స్టేషన్ పరిధిలో గోపాలపురం, మహంకాళి, మోండా మార్కెట్, మారేడపల్లి, తుకారమ్ గేట్ రానున్నాయి. చిక్కడపల్లి పరిధిలో గాంధీనగర్, దోమల్‌గూడ, చిక్కడపల్లి ప్రాంతాలు ఉంటాయి. శంషాబాద్ లో కొత్తగా గండిపేట్, కొండాపూర్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. కొండాపూర్ పరిధిలో కొండాపూర్‌తో పాటు మాదాపూర్ ప్రాంతాన్ని చేర్చారు. గండిపేట్ పరిధిలో గండిపేట్ మండలం ఉంటుంది. సరూర్‌నగర్ పరిధిలో మీర్‌పేట్ స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీతో పాటు మరో రెండు డివిజన్లు ఉంటాయి. పెద్ద అంబర్‌పేట్ స్టేషన్ పరిధిలో బీఎన్‌రెడ్డి నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలు ఉంటాయి. మేడ్చల్‌లో కొంపల్లి, కూకట్‌పల్లి స్టేషన్‌లను కొత్తగా ఏర్పాటు చేశారు. కొంపల్లి స్టేషన్ పరిధిలో 129వ వార్డు, నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలను చేర్చారు. కూకట్‌పల్లిలో 114, 122, 123, 124వ వార్డులను చేర్చారు. మల్కాజిగిరిలో కాప్రా, నాచారం, అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్లు కొత్తగా రానున్నాయి. కాప్రా పరిధిలోకి కాప్రా మున్సిపాలిటీ, ఏఎస్‌రావునగర్, తదితర ప్రాంతాలు, నాచారం పరిధిలో 4వ వార్డు, మౌలాలి హౌసింగ్‌బోర్డు కాలనీ, నాచారం, చిలుకానగర్, హబ్సిగూడ తదితర ప్రాంతాలు ఉంటాయి. అల్వాల్ స్టేషన్‌లో పరిధిలో అల్వాల్ మాత్రమే ఉంటుంది. కొత్తగా ఏర్పాటు కానున్న ఎక్సైజ్ స్టేషన్‌లకు బంజారాహిల్స్, చిక్కడపల్లి, గండిపేట్, కొండాపూర్, పెద్ద అంబర్‌పేట్ కూకట్‌పల్లిలో అద్దె భవనాలను గుర్తించారు. అద్దె భవనాలు లభించని మిగతా స్టేషన్‌లు.. మారేడ్‌పల్లి, మీర్‌పేట్, కొంపల్లి, కాప్రా, నాచారం, అల్వాల్ స్టేషన్‌లు ప్రస్తుతం ఉన్న పాత స్టేషన్‌లలోనే కొనసాగుతాయి. పాత ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లే కొత్త ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు ఇన్‌చార్జిలుగా వ్యవహరించనున్నారు.

అల్మాస్‌గూడలో హైడ్రా పంజా



బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని జేసీబీతో తొలగించి చదును చేస్తున్న హైడ్రా సిబ్బంది



హైడ్రా సీఐ తిరుమలేశ్‌పై దాడికి యత్నిస్తున్న ల్యాండ్ వర్గీయులు

- రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ స్టేడియం కూల్చివేత
- మూసిన మూడు రోడ్లు, పార్కు స్థలానికి విముక్తి
- హైడ్రా సీఐపై దాడికి ల్యాండ్ వర్గీయుల యత్నం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో హైడ్రా పంజా విసిరింది. రోడ్లను ఆక్రమించి నిర్మించిన బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని నేలమట్టం చేసి కాలనీవాసులకు విముక్తి కల్పించింది. వివరాలివీ.. అల్మాస్‌గూడలో బోయపల్లి కుటుంబీకులు 1982లో జీపీ లే అవుట్ చేశారు. కాలనీకి బోయపల్లి ఎన్‌క్లేవ్ అని పేరుపెట్టారు. సర్వే నంబర్ 39,40,41,42,44లో 5.7 ఎకరాల లే అవుట్ ఉండగా అందులో మూడు రోడ్లు, 236 గజాల పార్కు స్థలం చూపించి ప్లాట్లు విక్రయించారు. భూ యజమానులు మూడు లింక్ రోడ్లతో పాటు పార్కు జాగా ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ఆక్రమించిన రోడ్ల స్థానంలో బాక్స్ క్రికెట్ స్టేడియం నిర్మించారు. ఈ క్రమంలో కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం హైడ్రా అధికారులు లే అవుట్‌ను పరిశీలించి కబ్జాను నిర్ధారించారు. గురువారం హైడ్రా సీఐ తిరుమలేశ్ నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు.

హైడ్రా సీఐపై దాడికి యత్నం

బాక్స్ క్రికెట్ స్టేడియంను కూల్చివేస్తుండగా ల్యాండ్ వర్గీయులు అడ్డుకునే యత్నం చేశారు. హైడ్రా సీఐ తిరుమలేశ్‌తో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో దాడికి యత్నించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అదే రీతిలో సీఐ బదులివ్వడంతో భూ యజమానులు వెనక్కి తగ్గారు. హైడ్రా సిబ్బంది వెంటనే జేసీబీతో క్రికెట్ స్టేడియాన్ని ధ్వంసం చేసి చదును చేశారు. లేఅవుట్‌లో చూపించిన పార్కు స్థలంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఇది పార్కు స్థలం అంటూ బోర్డు పాతించారు. దాడికి యత్నించిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ తిరుమలేశ్ తెలిపారు. అనంతరం కాలనీవాసులు సీఎం రేవంత్‌రెడ్డికి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.

పాతబస్తీలో పన్ను వసూలు చేయాలి



దీక్షలో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

- బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్
- మీర్‌పేటలో ఆస్తి పన్ను తగ్గించాలని రిలే నిరాహారదీక్ష

మీర్‌పేట: మీర్‌పేటవాసులపై ఇంటి పన్ను భారం తగ్గించి, పాతబస్తీలో పన్ను వసూలు చేయాలని బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. గురువారం ఇంటి పన్ను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మీర్‌పేట-1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్ష చేపట్టారు. దీనికి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్‌శంకర్‌రెడ్డిలతో కలిసి శ్రీరాములుయాదవ్ పాల్గొని మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతంలో ప్రభుత్వం ఇంటి పన్ను రూపంలో భారం వేస్తోందని, దీనిపై గతంలో నుంచే బీజేపీ పోరాటం చేస్తోందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన 15 నెలలకే అప్పటి బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్ ప్రభుత్వమే అధిక పన్ను వసూలు చేస్తుందని ఆరోపించారు. మీర్‌పేటలో పన్నులు తగ్గించకుంటే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో నాయకులు నర్సింహ, గోవర్ధన్‌రెడ్డి, సోమేశ్వర్, మధు, మాజీ కార్పొరేటర్లు హరినాథ్‌రెడ్డి, భీంరాజ్, విజయలక్ష్మి, అరుణ, గౌరీశంకర్, మల్లేష్ ముదిరాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రాఘవేందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గురువులు సమాజ నిర్మాతలు



ఎంఈఓ వెంకటయ్య దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: గురువులు నవ సమాజ నిర్మాతలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ ఎంఈఓగా 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వెంకటయ్య ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక పీవీ కన్వెన్షన్‌లో ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొన్ని వెంకటయ్యను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని. 15 ఏళ్లుగా మొయినాబాద్ మండల ఎంఈఓగా, అజీజ్‌నగర్, కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుడిగా వెంకటయ్య చేసిన సేవలు అందరికీ గుర్తుండిపోతాయన్నారు. జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా ప్రజల గుండెల్లో నిలిచిపోయే విధంగా సేవలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సధానందంగౌడ్, మాజీ జెడ్పీటీసీ అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ మంజుల, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి సతీష్, ఎంఈఓలు విజయ్‌కుమార్‌రెడ్డి, పురందాస్, అక్బర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

చేవెళ్ల: వివిధ కేసులలో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు చేవెళ్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం సీఐ ఎం.శ్రీలత ఓ ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ వేలం ఉంటుందని చెప్పారు. చేవెళ్ల సర్కిల్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు ముందుకు వచ్చి వేలంలో దక్కించుకోవాలని కోరారు.

మంచాల పీఏసీఎస్ కార్యదర్శిపై వేటు

మంచాల: మంచాల పీఏసీఎస్ కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. పీఏసీఎస్‌లో రూ.7,25,223 సంబంధించిన అవకతవకలపై నిర్వహించిన విచారణలో భాగంగా డీసీఓ ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయమై పూర్తి స్థాయి విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు రాంరెడ్డి, జనిగె వెంకటేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో గొడవపడి వ్యక్తి అదృశ్యం



నర్సింహులు (ఫైల్)

పహాడీషరీఫ్: తాగుడుకు బానిసైన వ్యక్తి భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. సర్దార్‌నగర్‌కు చెందిన వి.నర్సింహులు(55) ఇబ్రహీంపట్నంలో ప్రైవేట్ ఉద్యోగం నిర్వహిస్తున్నాడు. నాలుగు నెలల నుంచి తాగుడుకు బానిసైన అతడు ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే నర్సింహులుకు సర్ది చెప్పి బాగు చేయాలని అతని భార్య యాదమ్మ ఈ నెల 26వ తేదీన సర్దార్‌నగర్‌కు తీసుకొచ్చింది. అతనితో మాట్లాడేందుకు యత్నించగా, గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన అతని భార్య పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

మెట్రో రెండో దశపై కేంద్రం నజర్

- డీపీఆర్‌లపై స్పష్టత
- ఢిల్లీలో ఎన్వీఎస్ రెడ్డి పర్యటన
- సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చలు
- రెండోదశ మొదటి ఐదు కారిడార్‌లలో 76.4 కిలోమీటర్లు
- నార్త్, ఫ్యూచర్‌సిటీలపై వచ్చే నెలలో డీపీఆర్‌లు



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండో దశ ప్రాజెక్టుపైన కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రెండో దశలో ప్రతిపాదించిన మొదటి 5 కారిడార్‌ల డీపీఆర్‌లపైన సంబంధిత మంత్రిత్వ శాఖల అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో పాటు అధికారుల బృందం రెండు రోజుల క్రితం ఢిల్లీలో పర్యటించింది. డీపీఆర్‌లలోని సాంకేతిక అంశాలపైన చర్చలు జరిగినట్లు తెలిసింది. వివిధ మార్గాల్లో చేపట్టనున్న కారిడార్‌లపై కేంద్ర అధికారులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకే హెచ్‌ఏంఆర్‌ఎల్ అధికారులతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. మెట్రో రెండో దశలో ప్రభుత్వం మొదట 76.4 కిలోమీటర్లతో 5 కారిడార్‌ల నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 5 కారిడార్‌లపైన హెచ్‌ఏఎంఆర్‌ఎల్ సమగ్రమైన ప్రాజెక్టు నివేదికను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి అందజేసింది. కేంద్రం నుంచి ఆమోదం లభిస్తే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. సుమారు రూ.24 వేల కోట్ల అంచనాలతో రెండో దశలో మొదటి 5 కారిడార్‌లను ప్రతిపాదించారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టు డీపీఆర్‌లలో సాంకేతిక అంశాలపైన చర్చలు సాధారణమైన అంశమేనని, కేంద్ర కేబినెట్ దీనిపైన దృష్టి సారించినప్పుడే కీలకమైన ముందడుగు పడ్డట్లుగా భావించాలని హెచ్‌ఏఎంఆర్‌ఎల్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

ఏప్రిల్‌లో నార్త్, ఫ్యూచర్ సిటీల డీపీఆర్‌లు..

మరోవైపు నార్త్‌సిటీలో ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు ప్రతిపాదించిన రెండు కారిడార్‌లతో పాటు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో రెండో దశ 'బి' విభాగంలో ప్రతిపాదించిన కారిడార్‌లకే ఏప్రిల్‌లో డీపీఆర్‌లను ఖరారు చేసి రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరుకే అందజేయాల్సి ఉండగా ప్రాజెక్టుపైన సర్వేలు, అధ్యయనాల దృష్ట్యా ఏప్రిల్‌లో డీపీఆర్‌లు పూర్తి చేసే అవకాశం ఉంది. 'బి' విభాగంలో ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్లు, శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు 22 కిలోమీటర్లు, ఫ్యూచర్‌సిటీ కారిడార్ 41 కిలోమీటర్ల చొప్పున నిర్మించనున్న సంగతి తెలిసిందే. రెండో దశలో రెండు విభాగాలుగా మొత్తం 8 కారిడార్‌లలో 190.4 కిలోమీటర్ల వరకు మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి.

'డిజిటల్ అరెస్టు' కేసులో నిందితుల అరెస్టు

చిక్కిన వారిలో ఇద్దరు ఫిజియోథెరపిస్టులు

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు పేరుతో నేరాలకు పాల్పడే ఉత్తరాది వారికి తమ బ్యాంక్ ఖాతాలు అందిస్తూ సహకరిస్తున్న ముగ్గురు గుంటూరు వాసులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు ఫిజియోథెరపిస్టులు ఉన్నట్లు డీసీపీ దార కవిత వెల్లడించారు. నగరానికి చెందిన సాయిరాజ్‌కు సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. ఆయన పేరుతో తెరిచిన బ్యాంకు ఖాతా ద్వారా ముంబై కేంద్రంగా అక్రమ లావాదేవీలు జరిగినట్లు చెప్పి డిజిటల్ అరెస్టు చేశారు. ఆపై అతడి నుంచి రూ.3.57 లక్షలు వివిధ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయించుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్ నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేసింది. బాధితుడి నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకున్న ఖాతాల్లో గుంటూరుకు చెందిన ఫిజియోథెరపిస్టు శ్రీనివాసరావు ఖాతా కూడా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా... మరో ఫిజియోథెరపిస్టు ఎల్.జీవన్‌కుమార్ కోరడంతో తన ఖాతా ఇచ్చినట్లు అంగీకరించాడు. ఇతడినీ పట్టుకున్న పోలీసులు వివిధ కోణాల్లో ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌కు చెందిన రితిక అనే మహిళ గుంటూరుకు చెందిన వ్యాపారి టి.రఘువీర్ ద్వారా తనను సంప్రదించినట్లు జీవన్ వెల్లడించాడు. తన ఖాతాలో పడిన మొత్తం నుంచి తాను పది శాతం, జీవన్, రఘువీర్ ఐదు శాతం చొప్పున తీసుకుంటారని, మిగిలిన మొత్తాన్ని రితికకు అందిస్తామని చెప్పాడు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు పరారీలో ఉన్న రితిక మినహా మిగిలిన ముగ్గురినీ అరెస్టు చేశారు. వీరిపై దేశవ్యాప్తంగా 13 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. అలాగే... స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో నగర వాసి నుంచి రూ.6.2 లక్షలు కాజేసిన కేసులో గుజరాత్‌కు చెందిన అకౌంట్‌హోల్డర్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అహ్మదాబాద్‌కు చెందిన లలిత్‌కుమార్ జైశ్వాల్ కీలక సైబర్ నేరగాళ్లతో చేయి కలిపాడు. కమీషన్ తీసుకుంటూ తన బ్యాంకు ఖాతాను వారికి అందించాడు. దీంతో పోలీసులు ఇతడిని అరెస్టు చేశారు.

తల్లే చంపేసింది

మైలార్‌దేవ్‌పల్లి: నీళ్ల బకెట్‌లో పడి 14 రోజుల పసికందు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే చిన్నారిని తల్లే నీటి బకెట్‌లో వేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. మైలార్‌దేవపల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ గురువారం వివరాలు వెల్లడించారు. తమిళనాడు ప్రాంతానికి ముదిలాని మణి, ఆరోగ్య విజ్జి(30) భార్యాభర్తలు అలీనగర్‌లోని ఓ కంపెనీలో పని చేస్తూ అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు, 14 రోజుల కుమార్తె ఉన్నారు. మణికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో అతడి చికిత్స కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. దీంతో గత కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో పాప జన్మించడంతో ఆమె పోషణ విషయమై ఆరోగ్య విజ్జి ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 25న భర్త పనికి వెళ్లిన సమయంలో విజ్జి తన కుమార్తెను బాత్‌రూమ్‌లోని నీటి బకెట్‌లో పడేసి హత్య చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించింది. గురువారం నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

24 గంటల్లో వాటర్ ట్యాంకర్ల డెలివరీ

సాక్షి,సిటీబ్యూరో: వాటర్ ట్యాంకర్లను పెండెన్సీ లేకుండా 24 గంటల్లో డెలివరీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు జలమండలి ఒక ప్రకటనలో వెల్లడించింది. వాటర్ ట్యాంకర్ల పెండెన్సీపై 'సాక్షి' లో గురువారం ప్రచురితమైన ''ట్యాంకర్.. ఫికర్!'' కథనంపై స్పందించిన జలమండలి వివరణ ఇచ్చింది. ఈ నెల 25,26 తేదీల్లో బుకింగ్ జరిగిన ట్యాంకర్లను ఎలాంటి పెండెన్సీ లేకుండా 24 పని గంటల్లోనే క్లియర్ చేసినట్లు పేర్కొంది. మొత్తం ఫిల్లింగ్ స్టేషన్లలో రోజువారీగా సగటున 9049 నుంచి 9080 వరకు ట్యాంకర్ల బుకింగ్ జరుగుతుందని, అందులో 86 నుంచి 112 వరకు బుకింగ్ లు మాత్రమే వివిధ కారణాలతో పెండింగ్ పడుతున్నట్లు తెలిపింది. ట్యాంకర్ల డిమాండ్ దృష్ట్యా డెలివరీలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉగాది డైరీ ఆవిష్కరణ

సుల్తాన్‌బజార్: దేవాదాయ శాఖలో కారుణ్య నియామకాల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు అర్చక ఉద్యోగ జేఏసీ, ఉద్యోగుల సంఘం నాయకులు గంగు ఉపేంద్ర శర్మ, కాండూరి కృష్ణమాచార్యులు తెలిపారు. గురువారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపేంద్ర శర్మ, కృష్ణమాచారి తదితరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో కలిశారు.


కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి




సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్ సర్వే నంబర్ 240లోని ప్లాట్లు.. తమ భూమిలో ఉన్నాయని ఆరోపిస్తూ, కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం కమ్మగూడలోని కళ్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. శివాజీనగర్, అన్నపూర్ణ, కళ్యాణవేంకటేశ్వరస్వామి కాలనీకి చెందిన ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ.. 240, 241, 242లోని 61 ఎకరాల భూమిలో సుమారు 30ఏళ్ల క్రితమే మొత్తం 18 వెంచర్లు చేశారని, వీటిలో అనేక మంది అమాయకులు ప్లాట్లు కొనుగోలు చేశారని తెలిపారు. ఇటీవల సర్వే నంబర్ 240లోని 10.09 ఎకరాల భూమి తమదేనంటూ కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సదరు భూముల్లో చాలా మంది ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని, నివాసం ఉంటున్నారన్నారు. ప్లాట్ల కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులు, ప్రభుత్వాన్ని కోరారు.

పేలుడు పదార్థం కొరికి గేదె మృతి



పోలీసులకు లభించిన పేలుడు పదార్థం



కళేబరం

యాచారం: అడవి పందులను చంపేందుకు పెట్టిన పేలుడు పదార్థాన్ని కొరికి పాడి గేదె మృతి చెందిన ఘటన గురువారం యాచారంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి ఉదయం 11గంటలకు తన గేదెలను మేతకు తీసుకెళ్లాడు. అయితే అడవి పందులను చంపేందుకు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన పేలుడు పదార్థాన్ని కొరికిన ఓ గేదె తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయమై బాధితుడిద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, పశు సంవర్ధక సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ఈక్రమంలో గేదె మృతిచెందిన పరిసరాలను గమనించగా మరో పేలుడు పదార్థం కనిపించడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తహసీల్దార్ ఎదుట నలుగురి బైండోవర్

తలకొండపల్లి: భూమి విషయంలో తగాదా పడుతున్న నలుగురిని స్థానిక తహసీల్దార్ నాగార్జున ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. తలకొండపల్లి గ్రామానికి చెందిన అనుపాటి యాదయ్య, అనుపాటి గణేష్, అనుపాటి ఆంజనేయులు, అనుపాటి పార్వతమ్మలకు శివారులో కొంత పొలం ఉంది. కొన్నేళ్ల నుంచి ఆ పొలం విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల మధ్య కేసులు నమోదయ్యాయి. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఎస్ఐ శ్రీకాంత్ గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎదుట నలుగురిని హాజరు పరిచారు. ఘర్షణతో సమస్య పరిష్కారం కాదని సూచించారు.

అనుమానాస్పదంగా పాడి ఆవులు మృతి



కేశంపేట: అనుమానాస్పదంగా రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వడ్డే నర్సమ్మ పాడి పరిశ్రమపైన ఆధారపడి జీవిస్తోంది. ఇటీవల సుమారు రూ.3 లక్షలు వెచ్చించి రెండు పాడి ఆవులను కొనుగోలు చేసింది. రోజు మాదిరిగా వాటిని తన వ్యవసాయ పొలం వద్ద ఉంచగా అనుమానాస్పదంగా మృతి చెందాయి. శివారులోని మైనింగ్‌లో బ్లాస్టింగ్ వల్ల పాడి ఆవులు మృతి చెందాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చేవెళ్ల బార్ అసోసియేషన్‌కు ఎన్నిక



గెలుపొందిన సభ్యులను అభినందిస్తున్న తోటి న్యాయవాదులు

అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల బార్ అసోసియేషన్‌కు గురువారం హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.నర్సింలు, జి.క్రిష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా సి.మహేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా కె.యాదగిరిగౌడ్, లైబ్రేరియన్‌గా పి.మల్లేశం, మహిళా ప్రతినిధిగా జె.గీతవజాక్షి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ప్రకాశం, సీహెచ్.రవీందర్, ఈశ్వర్, ఎం.శివరాజ్, ఎం.ప్రదీప్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులను తోటి న్యాయవాదులు అభినందించారు. అడ్వకేట్ల సమస్యలపై బార్‌అసోషియేషన్ నిరంతరం పోరాటం చేస్తోందని నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కోహెడ మార్కెట్ నిర్మాణానికి సహకరించండి

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, మార్కెట్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: కోహెడలో నిర్మించబోయే అంతర్జాతీయ సమీకృత మార్కెట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. మార్కెట్ నిర్మాణానికి సంబంధించిన పరిపాలన అనుమతులు వేగవంతం చేయడంతో పాటు సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా సీఎం అధికారులను ఆదేశించినట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దేశంలోనే ఆదర్శవంతంగా కోహెడ మార్కెట్ నిర్మాణం చేపట్టాలని సీఎం సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్ శాంతకుమారి, వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్‌రావు, సీఎం ఓఎస్‌డీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కాలిబూడిదైన కారు



ముడిమ్యాల గేట్ సమీపంలో రోడ్డుపై కాలిపోతున్న కారు

చేవెళ్ల: రోడ్డుపై వెళ్తున్న స్కోడా కారులో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి మొత్తం కాలిపోయింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముడిమ్యాల గేట్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని కేసారానికి చెందిన కె.రాజశేఖర్‌రెడ్డి తన స్కోడా కారులో గ్రామం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మూడు కిలోమీటర్లు వెళ్లగానే కారు లోపలికి ఏసీ విండోల నుంచి మంటలు అకస్మాత్తుగా రావటంతో భయపడి ఆయన దిగాడు. ఈ క్రమంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. కారులో ఒక్కడే ఉండటంతో ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడ్డాడు. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.